


# భోగంమేళాలు

రచన: నందివాడ కామేశ్వరరావు

వివాహం ఇనేది జీవితంలో ఒకసారి జరిగే గొప్పపండుగ.

సంవత్సరం పొడవున మనకివచ్చేపండుగ లన్నింటిలోకి, జీవితాంతంవరకు ఆనందాన్ని, సౌఖ్యాన్ని అనుభవించుటకై చేసుకున్న పెళ్ళియే గొప్పపండుగ. అంటే జీవితంలో వివాహంకంటె గొప్పదయినపండుగ యింకొకటి లేదన్నమాట. అటువంటి వివాహము యెంతో వినోదంగా జరుగుటకు మనం అనేకరకముల వినోదాలు కల్పించుకుంటాము. అందులో భోగంమేళం ఒకటి. పూర్వం దేవాలయాల్లోను, రాజులు బయలుదేరేముందు, దర్బారులలోను యీ భోగంమేళాలు విధిగావుండేవి. అందుకే వాళ్లని దేవదాసీలు అనేవారు. ఎంత లేనివారైన పెళ్ళినాడు యేదో ఒకవేడుక కల్పించుకొనక మానరు. కేవలం వినోదంకోసం మాత్రమే యేర్పాటుచేసుకున్న యీ మేళాన్ని నిషేధించడం యేమంత మంచిపనికాదని నా అభిప్రాయం. అయితే వారు అవలంబిస్తూవున్న నీచపుపనులు మంచివా అంటారేమో! అది (వ్యభిచారము) వారి కూటికొరకు నేర్చుకున్న విద్య. అదికూడా వారితప్పుకాదు. పూర్వంనుంచి అధికారవర్గంలో వున్నవారు ఆడివడుచు ఆడుతూవుంటే ఆశపడి, డబ్బుయిస్తామని ఆశచూపి చేపట్టేవారు. డబ్బుకి ఆశపడి రోజులకి భయపడి మానాన్ని అమ్ముకోవడంవల్ల, యీ నాటికి వృత్తిగా చలామణి అవుతున్నాది. మొగవాడికి నిగ్రహశక్తి లేక ఆడదాన్ని అడిపోస్తే యేంలాభం! కానిలేందే గుమ్మంలో కాలుపెట్టనీయదు సాని దానితల్లి. యింట్లో రంభలాంటి పెళ్ళాంవుండగా రంకుటాలిదగ్గరకు వెళ్లడం మనతప్పు కాదా! ప్రభుత్వం భోగంమేళాన్ని నిషేధించిందిగాని వారికేమైన వృత్తికల్పించిందా! మరి వారిగతేమికాను? వారిలో మంచిమార్గాలు ప్రబోధించి, వాళ్లనికూడ సంసారులుగా చేయడం సంఘముయొక్క ధర్మము. పురుషుడు భోగందానిదగ్గరకు వెళ్లకూడదు అని నిషేధించడము, దానికితగిన చట్టములుపెట్టడము బాగుంబుంది కాని, వినోదముకోసం యేర్పాటుచేసుకున్న మేళాన్ని నిషేధించడమువల్ల వారికి వచ్చే అదాయము చెడిపోతున్నాది. సినీమాలు, నాటకాలు మనము వినోదముకోసం యెలాచూస్తామో, అలాగే భోగంమేళాన్నికూడా చూడాలి. అడది అడుతున్నాదని నాలికలు చప్పరించడము మగవాడికి మంచిదికాదు. పురుషుడు చిక్కేడుకదా అని కౌగలించుకోవడము కోమలికి మంచి పనికాదు. వేశ్యలవల్ల అనేకమైన కుటుంబాలు నాశనమైపోతున్నాయి. నిజమే....వేశ్యావృత్తి అవలంబిస్తూవున్నవాళ్లు అన్నిజాతులలోవున్నా రీ కాలములో. అందుచేత మేళమువాళ్ళ భోగంవాళ్ళు అనడము న్యాయముకాదు. తిండికిలేక ఆర్థికచిక్కులతో, అనేకబాధలతో అలమటిస్తూవున్న పతితులు వేరేగతిలేక యీ నీచపువృత్తికి దిగవలసివస్తున్నాది. అటువంటివారికి ప్రభుత్వము యేదైనా వుపాధిచూపి, ఆ వృత్తిని మాన్పించాలి. వివాహాల్లో బ్యాండుమేళం యేలాంటిదో, డ్యాన్సుమేళముకూడా అలాంటిదే. అసలు యీనాడు వ్యభిచారానికి ముఖ్యకారణం సినీమాలు వాటిలోచూపించే అర్ధనారీ శరీరము, అసభ్యకరమైన పోకడలు. ముందు వాటిని అరికట్టాలి. పురాణచిత్రాల్లోకూడా పార్వతికి జాకెట్టు వుండదు. సీతాదేవి లవ్వు (Loue) డ్యాన్సు. యింక, ముప్పయ్యోపడి పైనబడ్డ యువతీయువకులకు వివాహాలు కావు. యెన్నేళ్ళువచ్చిన మా అబ్బాయికి పాతికేళ్లు దాటలేదు అంటాడు తండ్రి, మా అమ్మాయి పదునాలుగేళ్ళు నిండలేదు అంటుంది తల్లి. యింక ప్రపంచకము పరిస్థితులు యెలాగుంటాయో మీరే ఆలోచించండి.

పురుషుడికి వుద్యోగం యెలాగో, నాట్యకత్తెకు డ్యాన్సు అలాగే వృత్తి. మనము ఆ భావముతో వుండాలికాని, వేశ్య అనికాదు. అమె చెడుమార్గాలు అవలంబించినప్పుడు శిక్షించాలి.

(ఈ వ్యాసం భోగంమేళాన్ని నిషేధించుట అన్న విషయంపై విమర్శమాత్రమే. కాని వేశ్యావృత్తిని ప్రోత్సహించుటమాత్రము కాదు. పాఠకులు గ్రహించగలరని మనవి.)

★